

సంగారెడ్డిలో మంగళవారం మెదక్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్‌యాదవ్, జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ జైపాల్‌రెడ్డి తదితరులు

# పొత్తు కాదన్నందుకే కత్తిగట్టారు

- ఆ కక్షతోనే ఎమ్మెల్సీ కవిత అరెస్ట్
- కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయి
- బీఆర్‌ఎస్ గెలిస్తేనే తెలంగాణ నిలుస్తది
- కాంగ్రెస్‌ది బూతుల, బూటకపు పాలన
- ఎన్నికల్లో బీఆర్‌ఎస్-బీజేపీ మధ్యే పోటీ
- నాలుగు నెలల్లో 180 మంది రైతులు, 38 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య
- కాంగ్రెస్‌కు ఓటేసి వృథా చేసుకోవద్దు
- వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించాలి
- ఎన్నికల సన్నాహక సమావేశంలో హరీశ్

సంగారెడ్డి/మెదక్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయన్న ప్రచారంలో నిజం లేదని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. అదే నిజమైతే కవిత ఎందుకు అరెస్ట్ అయ్యేవారని ప్రశ్నించారు. తమతో కలిసి రాలేదనే కవితను, కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒకటేనని.. మైనార్టీలు కాంగ్రెస్‌కు ఓటువేసి వృథా చేసుకోవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు మైనార్టీ వర్గం నుంచి ఒక్క మంత్రి కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో మంగళవారం మెదక్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలోను, అనంతరం మెదక్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలోను హరీశ్‌రావు మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌కు కంచుకోట అయిన మెదక్ పార్లమెంటు స్థానంలో గులాబీ జెండా మరోమారు రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. సౌమ్యుడు, పేదలకు అండగా నిలిచే వెంకట్రామిరెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఓటర్లను కోరారు. బీజేపీ అభ్యర్థి పనిమంతుడు అయితే అసెంబ్లీ ఎన్నికల్లోనే దుబ్బాక ప్రజలు గెలిపించేవారని, పనికి రాడు కాబట్టే ఓడించారని విమర్శించారు.

### పేద విద్యార్థుల కోసం వందకోట్లతో ట్రస్టు

తనను మెదక్ ఎంపీగా గెలిపిస్తే పేద విద్యార్థులు, బీఆర్‌ఎస్ కార్యకర్తల పిల్లల చదువుల కోసం రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేస్తానని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. ఐఏఎస్ అధికారిగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 ఏండ్ల పాటు సేవలు అందించానని, ఇక్కడి ప్రజలతో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని చెప్పారు. సిద్దిపేట ప్రాంతానికి చెందిన సౌమ్యతోపాటు పలువురు పేద పిల్లలను దత్తత తీసుకుని ఉన్నత చదువులకు సహకరిస్తున్నట్టు చెప్పారు. తనను ఎంపీగా గెలిపిస్తే మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, పార్టీ కార్యకర్తలు ఉపయోగించుకునేలా మెదక్‌వ్యాప్తంగా ఫంక్షన్‌హాళ్లు నిర్మిస్తానని తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు తన విజయానికి సహకరించాలని కోరారు. సమావేశాల్లో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, శివకుమార్, మామిళ్ల రాజేందర్, మాణిక్యం, బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌కు చురకలు పెట్టాల్సిందే

వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని హరీశ్‌రావు విమర్శించారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా మోసం చేశారని దుమ్మెత్తిపోశారు. రైతులు సాగు నీరు, కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చురకలు పెడితేనే గ్యారెంటీలు అమలు చేస్తుందని చెప్పారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా తెలంగాణకు బీజేపీ తీవ్ర అన్యాయం చేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇతర పార్టీలకు ఎలాంటి సిద్ధాంతాలు ఉన్నా, బీఆర్‌ఎస్‌ది మాత్రం తెలంగాణ ఆత్మగౌరవమే ఎజెండా అని స్పష్టం చేశారు. గత పదేండ్లలో ప్రజలకు తాగునీరు, విద్యుత్తు సమస్యను కేసీఆర్ శాశ్వతంగా దూరం చేశారని పేర్కొన్నారు.

### రేవంత్‌ది బూతుల, బూటకపు పాలన

రేవంత్‌రెడ్డిది బూతుల పాలన మాత్రమే కాదని, బూటకపు పాలన కూడా అని ప్రజలకు తెలిసిపోయిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పాత స్కీంలకు పాతరేసి, కొత్త స్కీంలలో కోతపెట్టారని దుయ్యబట్టారు. అసలు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటువేయాలని నిలదీశారు. ప్రతిపక్ష కార్యకర్తలు, నాయకులపై కేసులు పెట్టినందుకు ఓటేయాలా? అని ప్రశ్నించారు. ఆసరా పింఛన్ లబ్ధిదారులు రూ. 4వేలు, రైతుబంధు రూ. 15 వేలు అందుకున్నవారు, రుణమాఫీ అమలైన వారు మాత్రమే కాంగ్రెస్‌కు ఓటేయాలని, రానివాళ్లు బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు 180 మంది రైతులు, 38 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



## నామా హాజరు శాతం 88.3

**పార్లమెంట్‌కు ఎక్కువ రోజులు హాజరు**

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): 17వ లోక్‌సభకు తెలంగాణ నుంచి అత్యధికంగా హాజరైన వారిలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరావుకు టాప్‌లో ఉన్నారు. మొత్తం 273 రోజులకుగాను 241 రోజులు (శాతం 88.3) ఆయన సభకు హాజరై.. వివిధ సమస్యలపై 202 ప్రశ్నలు అడిగారు. నామా తర్వాత ఎక్కువ రోజులు హాజరైనవారిలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఉన్నారు. ఈయన 240 రోజులు హాజరై.. 78 ప్రశ్నలు మాత్రమే అడిగారు. తెలంగాణ నుంచి అత్యధికంగా ప్రశ్నలు అడిగిన బీఆర్‌ఎస్ లోక్‌సభ సభ్యుల్లో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి ఉన్నారు. ఆయన 194 రోజుల్లో 345 ప్రశ్నలు అడిగారు.

# కాంగ్రెస్ కరువును తీసుకొచ్చింది

## వంద రోజుల్లో హామీలు అమలు చేయలేదు

హామీలు అమలు చేయకపోతే ఆందోళనలే
మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల హెచ్చరిక

వేల్పూర్, మార్చి 26: కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతోనే కరువు ఏర్పడిందని, ఫలితంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో మీడియాతో మాట్లాడారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదని అన్నారు. కేసీఆర్ పాలనలో రైతులకు పుష్కలంగా సాగు నీరు, 24 గంటల కరెంట్ ఇచ్చామని, రైతుబంధు కూడా సీజన్ ఆరంభంలోనే విడుదల చేశామని అన్నారు. కానీ కాంగ్రెస్ హయాంలో సాగునీరు లేక, సరిగ్గా కరెంట్ లేక కాలిపోతున్న మోటర్లతో రైతులకు దుఃఖమే మిగిలిందని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం రివర్స్ పంపింగ్ ద్వారా దిగువ నుంచి గోదావరి నీళ్లను తెచ్చి శ్రీరాంసాగర్ నింపి, వరద కాలువ ద్వారా ఏడాదంతా పంటలకు సాగునీరందించినట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలకు నీళ్లు ఇవ్వలేక పోతుందని, పైగా ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా కేటాయింపుల కంటే ఎక్కువ నీటిని కిందకి తరలిస్తూ ఇక్కడి రైతాంగానికి అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. దీనికి కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కప్పలవాగు, పెద్దవాగులో అనేక చెక్‌డ్యామ్‌లు తమ ప్రభుత్వ హయాంలో నిర్మించినట్టు చెప్పారు. ప్యాకేజీ 21 ద్వారా కప్పలవాగు, పెద్దవాగులో నీళ్లు కూడా వదిలి వాటిని నీటితో నింపితే ఆ వాగు వెంట ఉండే గ్రామాల్లో బోర్లలోకి నీళ్లు వచ్చి సుమారు 40 వేల ఎకరాలకు ప్రయోజనం కలిగేదని అన్నారు. వాగుల్లో 0.5 టీఎంసీల నీరు వదలాలని రైతుల తరపున విన్నవించినా, లేఖలు రాసిన ఈ చెవిటి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ, వరికి రూ.500 బోనస్ వంద రోజుల్లోనే ఇస్తామని మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ.. 110 రోజులవుతున్నా ఎందుకు హామీలను అమలు చేయడం లేదని ప్రశ్నించారు.



అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో మీడియాకు వినిపిస్తున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

### రైతులకు లీగల్ నోటీసులా?

బ్యాంకు అధికారులు అప్పులు కట్టాలని రైతులకు లీగల్ నోటీసులు ఇవ్వడం సరికాదని వేముల అన్నారు. రైతులెవరూ రుణాలు కట్టాల్సిన అవసరం లేదని, రైతుల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ పోరాడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ సర్కార్ కంటే ఎక్కువ, కౌలు రైతులకు కూడా సాయం చేస్తామని హామీనిచ్చిందని, అయితే ఇప్పటివరకు 3 ఎకరాలకు మించి ఉన్న రైతులకు పంట పెట్టుబడి డబ్బులు వేయలేదని దుయ్యబట్టారు.

### ఎన్నికల కోడ్ అడ్డురాదు..

పెట్టుబడి సాయానికి ఎన్నికల కోడ్ అడ్డు కాకూడదని, కాంగ్రెస్ నేతల మాదిరిగా తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయబోమని వేముల స్పష్టం చేశారు. రైతులకు సాయం విషయంలో రాజకీయాలకు పాల్పడబోమని అన్నారు. రాజకీయాలు మాని రైతులకు మేలు చేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీని 100 ఫీట్ల లోతులో బొందపెడుతా, పేగులు మెడలో వేసుకుంటానని రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాని.. రైతుల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు.



జగిత్యాల రూరల్ మండలంలోని పొలాసలో మహిళను పలకరిస్తున్న నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

# రేవంత్ ఝూటాకోర్ ముఖ్యమంత్రి

- వైఎస్‌తోనే కాంగ్రెస్ చనిపోయింది
- ఇది రేవంత్ తెలుగుదేశం మాత్రమే
- కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే కాళేశ్వరంపై కుట్రలు
- కాంగ్రెస్ వంద రోజుల పాలనలో ఒక్క హామీ అమలు కాలేదు
- జగిత్యాలలో ప్రచారం షురూ చేసిన నిజామాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

జగిత్యాల, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి ఝూటాకోర్ ముఖ్యమంత్రి అని, తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాడని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో మంగళవారం పాదయాత్రను చేపట్టి, ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తర్వాత జగిత్యాల అర్బన్, రూరల్, జగిత్యాల పట్టణ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సాయంత్రం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశాడని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఒరిజనల్ కాంగ్రెస్ కాదని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణంతోనే అది చచ్చిపోయిందని అన్నారు. ఇప్పుడున్నది రేవంత్‌రెడ్డి తెలుగుదేశం డూప్లికేట్ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. కేసీఆర్ ఈ పదేండ్లలో తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దితే దాన్ని రేవంత్‌రెడ్డి నాశనం చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరంలో మూడు పిల్లర్లు కుంగితే మరమ్మతులు చేయించకుండా, కాళేశ్వరాన్ని వట్టిపోయేలా చేసి, కేసీఆర్‌ను బద్నాం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తున్నాడని విమర్శించారు. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం వంద రోజుల్లో ఒక్క హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ కవితకు భయపడి ఆమెను లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ చేయించారని ఆరోపించారు. సమావేశాల్లో బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రాగానే రాష్ట్రంలో దుర్భిక్షం

## పంటలు ఎండుతున్నా పట్టించుకునే వారే లేరు

- కేసీఆర్ పాలనలోనే సుభిక్షంగా తెలంగాణ
- నేను పార్టీ మారేది లేదు.. కేసీఆర్ వెంటే నడుస్తా
- ఎన్నికల తర్వాత భారీ మార్పులు మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం

బాన్సువాడ రూరల్, మార్చి 26: కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 110 రోజుల్లోనే తెలంగాణ దుర్భిక్షంగా మారిందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పంటలు ఎండి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ, జుక్కల్‌లో మంగళవారం నిర్వహించిన జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాల్లో పోచారం మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు 420 హామీలు ఇచ్చిందని, రుణమాఫీ, రైతు భరోసా, వరికి రూ.500 బోనస్ సహా మిగతా హామీలను అమలు చేయాలంటే ఏడాదికి రూ.3 లక్షల కోట్లు కావాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్టే అంత లేదని, మరీ ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీని నమ్మడం లేదని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత భారీ మార్పులు వస్తాయని తెలిపారు.

### కేసీఆర్ వెంటే నడుస్తా..

తాను పార్టీ మారుతున్నట్టు కొన్ని పనికి మాలిన యూట్యూబ్ చానళ్లు అసత్య ప్రచారం చేస్తున్నాయని పోచారం శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. తాను బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని, పదవులు అనుభవించి పార్టీలు మారే వ్యక్తిని కాదని స్పష్టంచేశారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించిన బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వెంటే ఉంటానని తెలిపారు. నలభై ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో తన వెంట ఉండి పదవులు అనుభించిన వారు తమ స్వార్థ రాజకీయాలతో పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో ఉన్న చెత్తంతా పోయిందని, ప్రస్తుతం ఆణిముత్యాల్లాంటి కార్యకర్తలు ఉన్నారని తెలిపారు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ పదేండ్లలో చేసిందేమీ లేదని, ఏ ముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని, తనను ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ పార్టీ జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ కోరారు. బాన్సువాడకు రైల్వేలైన్ తీసుకొచ్చే బాధ్యత తను తీసుకుంటానని హామీ ఇచ్చారు.



జుక్కల్‌లో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం. చిత్రంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

# శరణ్ చౌదరి ఎవరో తెలీదు

- రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకే తప్పుడు ఆరోపణలు
- ఫోన్ ట్యాపింగ్‌తో నాకు ఎలాంటి సంబంధం లేదు
- ఎలాంటి న్యాయ విచారణకైనా సిద్ధమే
- బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతా: మాజీ మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టేందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శరణ్ చౌదరి ఎవరో తనకు తెలియదని, ఓ ఎన్నారైని మోసం చేసినట్టు కొందరు ఎన్నారైలు సాయం అడిగితే పోలీసులను కలవాలని సూచించానని తెలిపారు. తనకు ఫోన్‌ట్యాపింగ్‌కు ఎలాంటి సంబంధం లేదని, దీనిపై విచారణ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'శరణ్ చౌదరి అక్రమాలు తెలిసి బీజేపీ నుంచి సస్పెండ్ చేశారు. భూదందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారంతో అనేక మందిని మోసం చేశాడు. నకిలీ పత్రాలు సృష్టించి ఎన్నారైలను తన దగ్గర పెట్టుబడులు పెట్టాలని కోరాడు. ఎన్నారై విజయ్ దగ్గర రూ.5 కోట్లు వసూలు చేశాడు. వందల ఎకరాల్లో భూములు ఉన్నాయని దొంగ పత్రాలు చూపించి మోసం చేశాడు. విజయ్‌కు భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవటంతో పలువురు ఎన్నారైలతో కలిసి విజయ్ నా దగ్గరికి వచ్చారు. హైదరాబాద్ సీపీని కలవాలని సూచించా. పోలీసుల విచారణలో శరణ్ చౌదరి దగ్గర భూమి లేదని తెలిసింది. రూ.5 కోట్లు తిరిగి ఇచ్చే పరిస్థితి లేదని వెల్లడైంది. రూ.3 కోట్ల విలువైన శరణ్ ఫ్లాట్‌ను విజయ్ రిజిస్ట్రేషన్ చేసుకొన్నారు. శరణ్ చౌదరిపై అనేక కేసులు ఉన్నాయి. ఆయన భార్య పాస్‌పోర్ట్‌ను కూడా సీజ్ చేశారు. అనేకమందికి డబ్బులు చెల్లించాల్సి ఉన్నది. ఇలాంటి వారిని ఎవరూ సమర్థించరు. విజయ్ అనే వ్యక్తిది విజయవాడ. ఆయన కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి. ఆయనకు, నాకు ఎలాంటి బంధుత్వం లేదు. నా జీవితంలో ఏనాడూ భూముల జోలికి పోలేదు. నా రాజకీయ జీవితంపై ఇంతవరకు ఎలాంటి మచ్చలేదు' అని వివరించారు. గతంలోనూ తనను ప్రభుత్వాలు అనేక ఇబ్బందులకు గురి చేశాయని, అయినా ఏనాడూ లొంగలేదని తెలిపారు. గతంలో బాబ్లీ ప్రాజెక్టు కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదని ఎర్రబెల్లి తేల్చిచెప్పారు. ప్రణీత్‌రావు ఎవరో తనకు తెలియదని అన్నారు. 'ఆయనది నాది ఒకే గ్రామం కాదు. వారి బంధువులు మా గ్రామంలో ఉంటారు. ఆయనను నేను ఏనాడూ కలవలేదు. పరిచయం కూడా లేదు. బంధువు కాదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేసుకోవచ్చు. ప్రణీత్‌రావు కుటుంబానిది ఏ పార్టీనో తెలుసుకోవాలి' అని వెల్లడించారు. పార్టీ మారాలని తనను ఒత్తిడి చేస్తున్న మాట వాస్తవమేనని, కానీ తాను బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.



మంగళవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

### శరణ్ చౌదరి మోసకారి: విజయ్, ఎన్నారై

మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై శరణ్‌చౌదరి చేసిన ఆరోపణలను విజయ్ ఖండించారు. వీడియో సందేశం ద్వారా జరిగిన ఘటనను ఆయన వివరించారు. 'నాకు నేరుగా దయాకర్‌రావు తెలియదు. పలువురు ఎన్నారైల ద్వారా ఆయనను కలిశా. మా సమస్య విన్న ఆయన హైదరాబాద్ సీపీని కలవాలని సూచించారు. నేను అప్పటి సీపీ సీవీ ఆనంద్‌ను కలిసి ఫిర్యాదు చేశా. శరణ్ ఫ్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి దాని మీద ఉన్న రూ.1.25కోట్ల బ్యాంక్ లోన్ కట్టా. అతడి వద్ద నుంచి ఇంకా రూ.2 కోట్లు రావాల్సి ఉన్నది. ఇవన్నీ దాచి కొత్త నాటకానికి తెర తీశారు. కొద్దికాలం క్రితమే దుబాయ్ పారిపోయాడు. మీడియా, సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాడు. శరణ్ చౌదరి పలువురికి ఇచ్చిన చెక్‌లు బౌన్స్ అయ్యాయి. ఎన్నారైలనుమోసం చేశాడు' అని పేర్కొన్నారు.

# అవకాశవాదులకు బుద్ధిచెప్పాలి

- విశ్వాస ఘాతకులను ప్రజలు నమ్మరు
- చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేద్దాం
- కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం
- ప్రజలను కాంగ్రెస్ నిండా ముంచింది
- సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి సబిత

మణికొండ, మార్చి 26: అవకాశవాద నాయకులకు బుద్ధి చెప్పాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. చేవెళ్ల ప్రజల శక్తిని బీజేపీ, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గడ్డం రంజిత్ రెడ్డి తక్కువ అంచనా వేశారని పేర్కొన్నారు. ప్రజలు వీరిని నమ్మబోరని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో మంగళవారం చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల శక్తిని తక్కువగా అంచనా వేసి విశ్వేశ్వరెడ్డి, రంజిత్‌రెడ్డి పార్టీ మారారని, ఇలాంటి అవకాశవాదులకు చేవెళ్ల గడ్డపై స్థానం లేదని తేల్చిచెప్పారు. అప్పట్లో రంజిత్‌రెడ్డి అంటే ఎవరో కూడా ఇక్కడి ప్రజలకు తెలియదని, అలాంటి వ్యక్తికి కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి పంపిస్తే చేవెళ్ల ప్రజలు గెలిపించారని గుర్తుచేశారు. ఇప్పుడా వ్యక్తికి చేవెళ్ల ప్రజలు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. రంగారెడ్డి మనవడినంటూ రాజకీయాల్లోకి వచ్చిన విశ్వేశ్వర్‌రెడ్డి క్షణంలోనే మనుషులను మరిచిపోతారని, అలాంటి వ్యక్తికి ప్రజల సమస్యలు ఏం గుర్తుంటాయని ఎద్దేవా చేశారు.



### చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా

జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ప్రజల్లో ఉంటూ సేవలందించారని, బడుగుల ఆశాజ్యోతిగా ఉన్న కాసానిని సమష్టిగా పనిచేసి గెలిపించి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని సబిత పిలుపునిచ్చారు. కేసీఆర్ నిషానా లేకుండా చేస్తానని సీఎం రేవంత్ ప్రగల్భాలు పలుకుతున్నారని, అది అసాధ్యమని పేర్కొన్నారు. కేసీఆర్ నిషానా లేకుండా చేయాలంటే తెలంగాణనే మార్చాలని, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మిని కూడా లేకుండా చేస్తారా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు మించి అభివృద్ధి చేస్తారని నమ్మి గెలిపించిన ప్రజలను కాంగ్రెస్ నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజేంద్రనగర్‌లో ప్రకాశ్‌గౌడ్‌ను గెలిపించుకున్నట్టే కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. కేసీఆర్ హయాంలో నార్సింగిలో ఇంటర్‌చేంజ్ ఏర్పాటు చేయడంతోపాటు అవుటర్ చుట్టూ సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కేసీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు యెగ్గే మల్లేశం, వాణీదేవి, దయానంద్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, మాజీ ఎంపీపీ మల్లేశ్, మున్సిపల్ చైర్మన్లు సుష్మారెడ్డి, రేఖయాదగిరి, నర్సింహ, చంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


